

ప్ర'జల' సమస్యలే..

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో జల సమస్యలపై చర్చించారు. పరిష్కార మార్గాలు సూచించారు.

- 8లో



2380 బృందాలు..20రోజులు

జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు సర్వే జరగనుంది. రేపటి నుంచి ప్రారంభమవుతుంది.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	32°	26°
ఇచ్ఛాపురం	32°	27°
పాతపట్నం	33°	27°
శ్రీకాకుళం	31°	26°

న్యూస్‌రీల్

ఆదిత్యుడిని దర్శించుకున్న ముంబై ఎంపీ



ఆదిత్యుని జ్ఞాపికను ఎంపీ మనోజ్‌కు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ముంబై సౌత్ ఈస్ట్ లోక్‌సభ సభ్యుడు మనోజ్ కొటక్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మనోజ్ మాట్లాడుతూ తొలిసారిగా ఆదిత్యుడిని దర్శించుకున్నానని, చాలా అద్భుతంగా ఉందని, దక్షిణాది రాష్ట్రాల్లో ఆలయాల నిర్వహణ, పూజా విధానాలు చాలా బాగుంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నేతలు సూర్యనారాయణ రాజు, సురేంద్ర మోహన్, పైడి వేణుగోపాలం, ఉమామహేశ్వరి, పూడి తిరుపతిరావు, అట్టాడ రవి బాబ్జీ, బి.ఉమామహేశ్వరరావు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

యూటీఎస్ మెషీన్ ప్రారంభం



యూటీఎస్ మెషీన్ ద్వారా ప్రయాణికునికి టికెట్ ఇస్తున్న డీఎం మాధవ్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో శనివారం యునైటెడ్ టికెట్ సొల్యూషన్(యూటీఎస్) మెషీన్‌ను శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మెషీన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రయాణికులకు చిల్లర సమస్య నుంచి తప్పించేందుకు ఈ మిషన్ ఉపయోగపడుతుందన్నారు. ప్రయాణికులు ఫోన్ పే, గూగుల్ పే, ఏటీఎం కార్డు ద్వారా ఈ మిషన్‌తో నగదు రహిత లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. టికెట్ తీసుకోవడం సులభం చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్ఎం కె.నరేంద్రబాబు, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీల్లో స్పోర్ట్స్ కోటా ద్వారా పలు పోస్టుల భర్తీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ)లో స్పోర్ట్స్ కేటగిరీలో కొన్ని పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రిన్సిపాల్, సీఆర్టీ గణితం, సీఆర్టీ బయలాజికల్ సైన్స్, సీఆర్టీ ఫిజికల్ సైన్స్, సీఆర్టీ ఇంగ్లిష్‌కు ఒక్కో పోస్టులను భర్తీ చేయాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉత్తర్వులు విడుదల చేశారని చెప్పారు. గుర్తింపు కలిగిన క్రీడాంశాల్లో ప్రపంచ స్థాయి, జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి, ఆలిండియా యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన/ ప్రాతినిధ్యం వహించిన మహిళలు ఈ నెల 24 నుంచి 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నిష్ణాతులైన స్పోర్ట్స్ అధికారుల సమక్షంలో త్వరలో క్రీడా ప్రాతినిధ్యపు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరానగర్ కాలనీ లో ఉన్న ఎస్‌బీఐ రామలక్ష్మణ బ్రాంచ్ వెనుక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేరుగా దరఖాస్తులను అందజేయాలని డాక్టర్ జయప్రకాష్ తెలిపారు.

బాలారిష్టాలు దాటి..

విద్యావ్యాప్తిలో మేటి



పీజీ అంత ఈజీ కాదు అన్న మాట సిక్కోలులో నాటుకుపోయిన కాలం. ఉన్నత విద్య చదవాలంటే పెట్టె బేడా సర్దుకుని కాలేజీ వెతుక్కుంటూ విశాఖ వెళ్లే రోజులవి. డిగ్రీ తర్వాత ఉన్నత చదువుల కోసం సగటు సిక్కోలు విద్యార్థి యాతన పడుతున్న సమయమది. అలాంటి అత్యవసర కాలంలో బీఆర్‌ఏయూ పురుడు పోసుకుంది. పీజీ స్టడీ సెంటర్ నుంచి వర్సిటీగా మారింది. వైఎస్ రాజశేఖర రెడ్డి ముందు చూపుతో సిక్కోలు కీర్తి కిరీటంలో ఈ చదువుల కేంద్రం చేరింది. వర్సిటీ ఏర్పాటై నేటికి పదిహేనేళ్లు పూర్తయ్యింది. ఈ ప్రయాణంలో బాలారిష్టాల నుంచి అత్యున్నత విజయాల వరకు వర్సిటీ ఎన్నో సాధించింది. నేడు ఈ విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం.

- బీఆర్‌ఏయూకు పదిహేనేళ్లు
- నేడు విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం
- వైఎస్సార్ హయాంలో 2008 జూన్ 25న వర్సిటీ ఏర్పాటు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్:

ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం జరగనుంది. ఎన్నో ఏళ్ల పోరాటానికి గుర్తుగా ఏర్పాటైన వర్సిటీ ఇప్పుడు సిక్కోలుకు పట్టభద్రులను అందిస్తోంది. 1989 నుంచి శ్రీకాకుళం జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, ఆంధ్రా విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కేంద్రంగా ఉన్న పీజీ సెంటర్‌ను వర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని నినాదాలు వినిపించేవి. కానీ వాటిని ఎవరూ వినలేదు. 2008లో సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి ఈ విషయం వెళ్లడంతో ఈ కల సాకారమైంది. ఆ ఏడాది జూన్ 25న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంగా ఎచ్చెర్ల పీజీ కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాల యంలో 21 విభాగాలు నిర్వహిస్తున్నారు. ఆర్ట్స్, సైన్స్, కామర్స్, లా, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. మరో పక్క వర్సిటికీ అనుబంధంగా 96 డిగ్రీ కళాశాలలు, 14 బీఎడ్ కళాశాలలు, 6 పీజీ కళాశాలలు, 6 బీపీఈడీ, డీపీఈడీ కళాశాలలు కొనసాగుతున్నాయి. సాధారణ కోర్సులతో పాటు కొత్త కొత్త కోర్సులను అందిస్తూ వర్సిటీ దూసుకెళ్తోంది. 1977లో పీజీ కేంద్రంగా ప్రారంభ మై, 2008 విశ్వవిద్యాలయంగా మారి ముందుకు సాగుతోంది.


విద్యార్థులకు మంచి అవకాశం



వర్సిటీ దగ్గరలో ఉండడం ఈ ప్రాంత విద్యార్థులకు మంచి అవకాశం. ఈ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కోర్సు అందుబాటులోకి వస్తుంది.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ప్రమాణాలతో కూడిన విద్య



విశ్వవిద్యాలయంలో వీసీగా బాధ్యతలు స్వీకరించిన నుంచి ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు కృషిచేస్తున్నాను. ప్రధానంగా నాక్ గుర్తింపు వర్సిటీ ప్రగతిలో కీలకంగా చెప్పవచ్చు. ఎల్ఎల్‌బీకి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు సాధించాం. భవిష్యత్‌లో సీనియర్ విశ్వ విద్యాలయాల కంటే వర్సిటీ ప్రగతి సాధిస్తుంది.

– ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

మైలురాళ్లెన్నో..



- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నాక్ -బి గ్రేడ్ సాధించింది.
- వర్సిటీకి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 12(బి) గుర్తింపు ఉంది.
- వర్సిటీ పచ్చదనం, పరిశుభ్రతలో మహాత్మా గాంధీ నేషన్ కౌన్సిల్ రూరల్ ఎడ్యుకేషన్ సంస్థ నుంచి గ్రీన్ క్యాంపస్ అవార్డును అందుకుంది.
- ఏపీ, ఒడిశా ప్రభుత్వాల ఒప్పందం మేరకు ఒడియా పీఠం వర్సిటీకి మంజూరు చేశారు.
- విద్యా విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్‌లో ఐదు కొత్తకోర్సుల ప్రారంభానికి నిర్ణయం తీసుకున్నారు.
- న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు లభించింది.
- వర్సిటీ అఫిలియేషన్‌లో పొందూరు, పలాస, తొగరాంల్లో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ప్రారంభమయ్యాయి.
- వర్సిటీలో కొత్తగా నాగార్జునా అగ్రికెం పరిశ్రమ సహకారంతో కెమికల్ టెక్నాలజీ రెండేళ్ల కోర్సు, అరబిందో పరిశ్రమ సహకారంతో ఇంటర్న్‌షిప్ కోర్సు, విద్యా విభాగం ఆధ్వర్యంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు.
- ఈ ఏడాది నుంచి డిగ్రీ ప్లస్ బీఎడ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రారంభిస్తున్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ అతి కొద్ది విద్యా సంస్థలకు మాత్రమే ఈ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం డిగ్రీని మంజూరు చేసింది.
- పోర్టు ఆపరేషన్స్, ఫైర్ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఎన్విరాన్‌మెంట్ హెల్త్ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులు కృష్ణ పట్నం సెక్యూరిటీస్ ఫోర్స్ ఒప్పందంతో నిర్వహిస్తున్నారు.
- ప్రస్తుతం 16 కోర్సులు అందుబాటులో ఉన్నాయి.



ఇంజనీరింగ్ కాలేజ్

నరసింహునిగా..



సోంపేటలో నరసింహస్వామి అవతారంలో జగన్నాథుడు

సోంపేట: హీరా పంచమి సందర్భంగా జగన్నాథుడు శనివారం నరసింహుని అవతారంలో దర్శనమిచ్చారు. సోంపేట పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వృద్ధుల బాధ్యత కుటుంబ సభ్యులదే: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ బాధ్యత సంబంధిత కుటుంబ సభ్యులదేనని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తేల్చిచెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ బాధ్యతపై తొలిసారిగా జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వృద్ధులైన తల్లిదండ్రులకు అన్యాయం జరగనీయబోమని అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించామని చెప్పారు. వృద్ధుల పోషణ పట్టించుకోకుండా వదిలేస్తే అలా చేసిన వారి ఆదాయంలోని కొంత భాగం వృద్ధులకు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలోని వృద్ధాశ్రమాలు బాగా పనిచేస్తున్నాయని, అదనపు ఆశ్రమాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సభ్యులను కోరారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం కమిటీ ఉత్సాహంగా పనిచేయాలని సభ్యులను కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ తిప్పేస్వామి, రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి, వివిధ ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠాలపై ఉక్కుపాదం

- ఎస్పీ జీఆర్ రాధిక
- ఇచ్ఛాపురంలో 46.5 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఇచ్ఛాపురం: గంజాయి ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇచ్ఛాపురంలో శనివారం మళ్లీ దాడులు చేసి గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. పట్టుకున్న గంజాయిని శనివారం ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గంజాయి రవాణా, నాటుసారా తయారీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. వీటి నివారణ కోసం పరివర్తన-2లో భాగంగా చెక్‌పోస్టుల వద్ద గస్తీ పెంచామని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేయడంతో పాటు పాత గంజాయి వ్యాపారులు, రౌడీ షీటర్లపై నిఘా ఉంచామని అన్నారు. రెండు రోజుల కిందట పురుషోత్తపురం చెక్ పోస్టు వద్ద 101 కిలోల గంజాయి పట్టుబడిందని, అలాగే శనివారం ఇచ్ఛాపురం పాత టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పురుషోత్తపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలతో పాటు ఒక రౌడీషీటర్, తమిళనాడుకు చెందిన ఆరుగురు వ్యాపారులు గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి 46.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 9 సెల్‌ఫోన్‌లు, ఒక స్కూటీ సీజ్ చేశామన్నారు. అరెస్టు చేసిన వారిలో ఒకరు మైనర్ అని చెప్పారు. ఒడిశా నుంచి లారీ డ్రైవర్ల ద్వారా గంజాయి వస్తున్నట్లు గుర్తించామని, వీటిపై దృష్టి పెట్టి ఇప్పటికే 66 మంది ప్రైవేట్ వెహికల్ ట్రాన్స్‌పోర్ట్, 66 మంది లాడ్జీ ఓనర్లకు నోటీసులిచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా 14500 టోల్ ఫ్రీ నంబర్‌తో అవగాహన కూడా కల్పిస్తున్నామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయి ముఠాను పట్టుకున్న సీఐ ఈశ్వర్ చంద్రప్రసాద్, టౌన్ ఎస్సై కూన గోవిందరావు, సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరావు ఉన్నారు.

● నారుమడికి రెడీ



వానలు మొదలు కావడంతో అన్నదాత నారుమడి తయారీలో పడ్డాడు. ప్రభుత్వం సకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు అందివ్వడంతో సరైన సమయంలో నారుమడులు వేసుకుంటున్నామని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – ఇచ్ఛాపురం రూరల్

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ భారత ప్రభుత్వం వారు 2024 ఏడాదికి గాను పద్మ అవార్డుల (పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ) కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు తెలిపారు. వివిధ రంగాల్లో పాల్గొనడమే కాకుండా ఆయా రంగాల్లో విశిష్టమైన సేవలు అందించిన వ్యక్తులు జూలై 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కళలు (ఆర్ట్స్), సామాజిక, సాంఘిక సేవ (సోషల్‌వర్క్), ప్రజా సంబంధాలు (పబ్లిక్ అఫైర్స్), సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం (మెడిసిన్), పాండిత్యం, విద్య (లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్), సివిల్ సర్వీసెస్, క్రీడలు (స్పోర్ట్స్), తదితర రంగాల్లో ఉత్తమ సేవలు కనబర్చిన వారి నుంచి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. అవార్డ్స్.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తు కాపీ ప్రతిని జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న సెట్‌శ్రీ కార్యాలయంలో ఈనెల 10వ తేదీలోపు అందజేయాలని ప్రసాదరావు సూచించారు. కేవలం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. మరిన్ని వివరాలకు కార్యాలయపు పనివేళల్లో సెట్ శ్రీ మేనేజర్ వీవీ అప్పలనాయుడు (94418 99549)ను సంప్రదించాలని ఆయన కోరారు.

బొడ్డేపల్లి ఆశయాలు నెరవేరుద్దాం

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- బొడ్డేపల్లి నిస్వార్థ సేవకుడు: మంత్రి సీదిరి
- కోటబొమ్మాళిలో బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహావిష్కరణ



కోటబొమ్మాళిలో బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు తదితరులు

కోటబొమ్మాళి: బొడ్డేపల్లి రాజగోపాలరావు ఆశయాలను నెరవేర్చాలని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం కోటబొమ్మాళి మండల పరిషత్ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని పాడి, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి ధర్మాన ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార కాలువను తెచ్చి జిల్లాను సస్యశ్యామలం చేశారని, ప్రభుత్వమే శత జయంతి ఉత్సవాలు నిర్వహించడంతో బొడ్డేపల్లి గౌరవం మరింత పెరిగిందన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు జిల్లాకు చేసింది శూన్యమన్నారు. రైల్వే స్టేషన్‌లో కుర్చీలు తప్ప ఏమీ చేయలేదన్నారు. ఎంపీగా నిస్వార్థ సేవలు అందించిన వ్యక్తి బొడ్డేపల్లి అని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ కూడా వంశధార ప్రాజెక్టుతో పాటు ఆఫ్‌షోర్ పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి నాయకురాలు దువ్వాడ వాణి రాజగోపాలరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రోణంకి ఉమ, జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుల సంరక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: వృద్ధుల సంరక్షణ (ఎల్డర్లీ కేర్ టేకర్) కోర్సుల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 35 ఏళ్ల లోపు పురుషులు, స్త్రీలు అర్హులన్నారు. వృద్ధుల సంరక్షణకు సంబంధించిన అంశాలను, మెలకువలను ఈ శిక్షణలో నేర్పిస్తామన్నారు. అలాగే ఇంటర్ బైపీసీ పాసైన వారికి 9 పారా మెడికల్ కోర్సుల్లో, డిప్లమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 7680945257, 7995013422 సంప్రదించాలన్నారు.

ప్రగతి దిశగా తీరం



రాజారాంపురం తీరంలో స్థానికులతో మాట్లాడుతున్న పర్యాటక అభివృద్ధి అధికారి నారాయణరావు

పోలాకి: జిల్లా తీర ప్రాంతంలో ప్రగతి దిశగా అడుగులు పడుతున్నాయని జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి ఎస్.నారాయణరావు తెలిపారు. రాజారాంపురం తీరంలో మత్స్యశాఖ, స్థానిక సచివాలయం సిబ్బందితో కలిసి శనివారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడుతూ అక్కడ ఉన్న అవకాశాలను గురించి తెలుసుకున్నారు. జిల్లాలో దాదాపు 8 చోట్ల తీరప్రాంతంలో పర్యాటకంగా అనువుగా ఉన్న ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి కార్తీక మాసంలో వేలసంఖ్యలో పర్యాటకులు సందర్శించే తీర ప్రాంతంగా గుర్తింపు పొందిన రాజారాంపురాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గతంలో స్థానికులు కోరిన మేరకు.. అధికారులు సందర్శించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

'డీఈఓ తీరు సరికాదు'

ఆమదాలవలస రూరల్: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలు జరిగాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పడాల తమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. డీఈఓ తీరు వల్ల వందలాది మంది అమాయక ఉపాధ్యాయులు బలైపోయారని ఆరోపించారు. టీచర్లు చేతిలో బదిలీల ఉత్తర్వులు పట్టుకుని మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చినా డీఈఓ ఏమరపాటు వల్ల సమస్యలు తప్పడం లేదని పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పట్టివేత

టెక్కలి రూరల్: మండలంలోని విక్రంపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ శనివారం రాత్రి తన సిబ్బందితో వెళ్లి గ్రామంలో తనిఖీలు చేశారు. గ్రామానికి చెందిన మక్క గంగాధర్ అనే వ్యక్తి ఇంటిలో సుమారు రూ.4లక్షలు విలువ గల బాణసంచా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. గంగాధర్‌ను ప్రశ్నించగా గత ఏడాది ప్రభుత్వ అనుమతుల మేరకు బాణసంచా దుకాణం ఏర్పాటు చేశానని, మిగిలిన సరుకును ఇంటిలో ఉంచానని తెలిపారు. ప్రమాదకరమైన వస్తువులు ఇలా ఉంచడం చట్టరీత్యా నేరమని, బాణసంచాను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు: కొత్తూరుకు చెందిన రాము(33) అనే వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాము ఇంటిలో ఓ శుభకార్యం జరగాల్సి ఉంది. అయితే ఆ కార్యం నిర్వహించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంటిలో ఉన్న దూలానికి ఉరి వేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.గోవిందరావు తెలిపారు. మృతుడి భార్య నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,180-00
బంగారం(22సి. 10గ్రా.)	54,250-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹270	₹ 280

ప్రజల సమస్యలే ప్రధాన అజెండా



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, పక్కనే మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, జేసీ నవీన్, డీఎఫ్‌ఓ నిషాకుమారి

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సమీక్ష
- విలువైన సూచనలు చేసిన ప్రజా ప్రతినిధులు
- సాగునీటి విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం విలువైన అంశాలను చర్చించింది. ప్రధానంగా సాగునీటి ఇబ్బందులపై అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్చించారు. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. అంతకుముందు డ్వామా, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ తదితర శాఖల ప్రగతిపై మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్‌ల సమక్షంలో సమీక్షించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్లు సిరిపురపు జగన్మోహనరావు, పాలిన శ్రావణి, బీసీ కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్, డీఎఫ్‌ఓ నిషాకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే సమావేశం అనంతరం ఫిష్ ఆంధ్రా పేరిట మొబైల్ స్టాల్‌ను మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. మత్స్యశాఖకు చెందిన ఈ యూనిట్ ధర రూ. 4.50 లక్షలు కాగా.. రూ.1.80 లక్షల వరకు సబ్సిడీ వచ్చింది. రూ.45 వేలు లబ్ధిదారుని వాటాగానూ, మిగిలిన 2.25 లక్షల వరకు బ్యాంకు రుణం అందిస్తారని ఆసక్తి గల లబ్ధిదారులు మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని మంత్రి సూచించారు.

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న కాలనీల్లో హౌసింగ్ ప్రక్రియ శరవేగంగా జరుగుతుందని ఇప్పటివరకు 27,500 ఇళ్లను పూర్తి చేయడంతో రాష్ట్రంలో మన జిల్లా మూడో స్థానంలో ఉందని ప్రకటించారు. అయితే చాలా కాలనీల్లో విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో సమస్యలున్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లుగా వివరించారు.
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ పోలాకి మండలం గుప్పిడిపేటలో అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలని కోరగా.. హౌసింగ్ ఈఈ గణపతి స్పందిస్తూ ఇళ్లు మంజూరయ్యాయని ప్రకటించారు.
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ కొత్తూరులో 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైనప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని, అలాగే గొప్పిలి వద్ద కూడా ఒక సబ్‌స్టేషన్‌ను ప్రతిపాదించారని గుర్తుచేశారు.
- రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం అద్భుత నిర్ణయమన్నారు.
- ఎంపీపీలు, జెడ్పీటీసీలు పలు సమస్యలను ప్రస్తావించారు.
- పలాస ఎంపీపీ ఉంగటి ప్రవీణ వంశధార నీరు తమ ప్రాంతానికి రావడం లేదని ఎస్ఈ డోల తిరుమలరావుతో వాగ్వాదం చేశారు. స్పీకర్ తమ్మినేని జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

● సకాలంలో సాగునీరు

స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ వంశధార, నాగావళి, నారాయణపురం సాగునీటి కాలువల్లో ఎక్కడా అడ్డం లేకుండా సాగునీరు టెయిల్‌ఎండ్ వరకు వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గుర్రపుడెక్క నిర్మూలన కూడా పెద్ద సవాల్‌గా మారిందన్నారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వ విద్య నాశనమైందని, ఇప్పుడు నాడు-నేడు ద్వారా అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వంపై విమర్శలను, అసత్య ప్రచారాలపై గట్టిగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

● జూలైలో వస్తారు

రాష్ట్ర పాడి పశు సంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ ఆస్పత్రి ప్రారంభానికి జూలైలో సీఎం వైఎస్ జగన్ జిల్లాకు వస్తారని తెలిపారు. ఇవి శంకుస్థాపనలు కావు, ప్రారంభోత్సవాలని గుర్తు చేశారు. జగనన్న సురక్షపై జెడ్పీటీసీలు, ఎంపీపీలు బాధ్యతగా పర్యవేక్షించాలని కోరారు. అలాగే జిల్లాలో సంచలనమైన వంశధార షట్టర్ల కేసు సీఐడీలో పెండింగ్‌లో ఉందని, త్వరలోనే ప్రభుత్వం సమీక్ష నిర్వహించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నిర్ణయిస్తుందన్నారు.

● నాడు-నేడు వల్లనే మంచి ఫలితాలు

జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ నాడు-నేడు పనుల వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి ఫలితాలు నమోదవుతున్నాయని అన్నారు. జగనన్న సురక్షలో ఉచితంగా 11 సర్టిఫికెట్లు అందిస్తున్న నేపథ్యంలో ఇంటికే పరిమితమైన దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే సదరం సర్టిఫికెట్లు అందేలా జిల్లా వైద్య శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జగనన్న కాలనీల్లో నీటి సదుపాయాన్ని పర్యవేక్షించాలన్నారు. విద్యాశాఖలో డిప్యుటేషన్ల విధానాన్ని నియంత్రించాలని డీఈఓ తిరుమలచైతన్యకు ఆదేశించారు.



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

యంత్రంతో వరి వెద సాగు బాగు



విత్తనం, ఎరువులు వేసే యంత్రంతో వరి వెద సాగు విధానంపై అవగాహనలో పాల్గొన్న రైతులు

గార: ఆధునిక యంత్రంతో వరి వెద సాగు పద్ధతి లాభదాయకమని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చినవాడాడ గ్రామంలో శనివారం ఆధునిక (ఫెర్టికమ్ సీడ్ డ్రిల్) యంత్రంతో వెద సాగు విత్తనాలు, ఎరువులు వేసే విధానంపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన జరిగింది. ఆయన మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితులు, వర్షాధారంగా లభిస్తున్న తక్కువ నీటితో లాభదాయక దిగుబడి సాధించాలంటే వరిలో వెద సాగు మంచిదని, అదే సమయంలో యంత్రంతో వేయడం వల్ల సమయంతో పాటు ఒకే సారి ఎరువులు కూడా వేయవచ్చన్నారు. ఇటీవల కాలంలో కూలీల రేట్లు అధికం కావడం వల్ల వరి సాగు చేసే రైతులు నారుమడి నుంచి నారు తీసి దమ్ము చేసి ఉభాలు వేయడం కష్టతరంగా మారిందన్నారు. ఎకరాకు 16 కిలోల శుద్ధి చేసిన విత్తనాన్ని నేరుగా చదును చేసిన పొలంలో ట్రాక్టర్‌తో నడిచిన ఎరువులు, విత్తనం వేసే మిషన్ ద్వారా విత్తుకోవచ్చన్నారు. కూడా 2.5 నుంచి 5 సెంటీమీటర్ల లోతులో విత్తనం పడేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు ఎస్.వెంకటరావు, రైతు మిత్రులు ఎల్.అప్పలనాయుడు, డి.ప్రభాకర్, ఆర్. అప్పలనాయుడు రైతులు పాల్గొన్నారు.

'పవన్ ఎమ్మెల్యేగా కూడా గెలవలేడు'

అరసవల్లి: చంద్రబాబుతో జత కట్టి తప్పుడు ప్రేలాపనలు చేస్తున్న పవన్ కల్యాణ్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కు ఉన్న ఏకైక అజెండా సీఎంను తిట్టడం మాత్రమేనని, అందుకే ఇలాంటి బుద్ధి లేని ప్రేలాపనలు చేస్తున్నారని అన్నారు. రోజుకో మాట, పూటకో ప్రకటన చేస్తూ సొంత పార్టీ కార్యకర్తలకే పవన్ తలనొప్పిలా మారారని దుయ్యబట్టారు. వ్యవసాయాన్ని పండుగ చేసినందుకా..? 32 లక్షల మందికి ఇళ్లు నిర్మిస్తున్నందుకా? లేదా విద్య, వైద్యాలయాలు నాడు-నేడు క్రింద అభివృద్ధి చేసినందుకా..? ఎందుకు వైసీపీ విముక్త ఏపీ అని అంటున్నారో పవనే చెప్పాలన్నారు. జిల్లాలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవడానికి ప్రధాన కారణం అచ్చెన్నాయుడేనని సీదిరి అన్నారు. పనికిరాని ఆలోచనలతో ఒక ఎత్తిపోతల పథకం పెట్టి తద్వారా నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరు అందకుండా చేశారని విమర్శించారు.

2380 బృందాలు.. 20 రోజులు



కుష్టు వ్యాధి గుర్తింపు కోసం ఇంటింటా సర్వేపై జిల్లా కేంద్రంలో అధికారులకు శిక్షణ ఇస్తున్న జిల్లా అధికారులు

- కుష్టు వ్యాధి నియంత్రణకు ఇంటింటా సర్వే
- ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు సర్వే నిర్వహణ
- రోజుకు 20 ఇళ్లు చూసేలా ప్రణాళిక

టెక్కలి: కుష్టు వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం వినూత్న చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పట్టణ, గ్రామాల్లో ప్రతి ఇంటిని సర్వే చేసి ఆయా కుటుంబ సభ్యులకు చర్మ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సర్వేకు సంబంధించి జిల్లా కుష్టు నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సుమారు 2380 బృందాలు పని చేయనున్నాయి. ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు ఈ సర్వేలు జరుగుతాయి. ఈ సర్వే ఏ విధంగా చేయాలి అనే విషయమై ఇటీవల పీహెచ్‌సీ స్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు, పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ అందజేశారు. వీరంతా వారికి కేటాయించిన పరిధిలో రోజుకు 20 ఇళ్ల చొప్పున సర్వేలు నిర్వహిస్తారు. జిల్లాలో గతంలో సుమారు 237 కేసులు ఉండగా ప్రస్తుతం సుమారు 197 కేసులు ఉన్నాయి. అంతేకాకుండా జిల్లా కేంద్రంలో గల రిమ్స్‌లో పునరావాస కేంద్రంలో రోగులకు ఆశ్రయం కల్పించి మందులు అందజేసేలా ఏర్పాట్లు చేశారు.

గుర్తింపు ఇలా..

కుష్టు నియంత్రణ కోసం చేస్తున్న ఇంటింటా సర్వేలో భాగంగా అనుమానిత కేసులను మొబైల్‌లో యాప్ ద్వారా ఫొటోలు తీసి వాటిని సూపర్ వైజర్ల ద్వారా వైద్యులకు పంపుతారు. ఆయా ఫొటోల్లో చర్మంపై ఉన్న మచ్చలను గుర్తించి మూడు రోజుల్లోగా వ్యాధి నిర్ధారణ చేస్తారు. కుష్టు వ్యాధి ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే వారికి మందులు అందజేసే విధంగా ప్రణాళిక రూపొందించారు.

లక్షణాలు ఇవి..

- చర్మంపై స్పర్శ లేని మచ్చలు, జిడ్డు లాంటి చర్మ, చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బొడిపెలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కను రెప్పలు మూత పడిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లల్లో స్పర్శ కోల్పోవడం, చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారి పోవడం, చేతి వేళ్లు, కాళ్ల వేళ్లు వంకర్లు రావడం తదితర లక్షణాలను కుష్టు వ్యాధికి సూచనలుగా చెప్పవచ్చు.
- శరీరం పై ఐదు కంటే తక్కువ మచ్చలు ఉంటే పీబీ (పాసి బ్యాచిలర్), ఎక్కువ ఉంటే ఎంబీ (మల్టీ బ్యాచిలర్) కేసులుగా పరిగణిస్తారు. పీబీ కేసులకు రెండు రకాల మందులను ఆరు నెలలుగా అందజేస్తారు. ఎంబీ కేసులకు మూడు రకాలుగా ఏడాది పాటు మందులు అందజేస్తారు. ఇవి క్రమంగా వాడితే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చు.

సమగ్ర సర్వే నిర్వహించాలి



కుష్టు వ్యాధిని సమూలంగా నియంత్రించేందుకు ప్రభుత్వం ఇంటింటా సర్వే నిర్వహిస్తోంది. ఈ సర్వేకు నియమించిన బృందాలు వారి పరిధిలో సమగ్రంగా సర్వేలు చేయాలి. ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దు. అలాగే సర్వేకు వచ్చిన బృందాలకు ఆయా కుటుంబ సభ్యులు పూర్తిగా సహకరించి వ్యాధి నిర్ధారణ చేసుకోవాలి. మందుల వినియోగంతో వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చు.

–ఎస్.అనురాధ, జిల్లా కుష్టు నివారణ విభాగం అధికారి.

ఆర్టీసీ దూర ప్రాంత ప్రయాణికులకు రాయితీ



జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారికి టిక్కెట్ ధరలో రాయితీ ఇస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ తెలిపారు. శనివారం శ్రీకాకుళంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి వంటి దూరప్రాంతాలకు ప్రయాణించే వారు ముందుగా రాను, పోను టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకుంటే టిక్కెట్ చార్జీలపై రాను 10 శాతం, పోను 10 శాతం రాయితీ లభిస్తుందన్నారు. గతంలో కేవలం తిరిగి వచ్చేటప్పుడు మాత్రమే పది శాతం రాయితీ వచ్చేదన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే జూలై 3వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా శ్రీకాకుళం నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్ సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. జూలై 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బస్సు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బయలుదేరి 2వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కంచి దర్శించుకుని అదే రోజు రాత్రి అక్కడ నుంచి బయల్దేరి 3వ తేదీ ఉదయం అరుణాచలం చేరుతుందని అన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం మళ్లీ సాయంత్రం బయల్దేరి 4వ తేదీ సాయంత్రానికి శ్రీకాకుళం చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్రకు సంబంధించి ఒక్కో ప్రయాణికుడికి ప్రయాణ చార్జీ రూ.4500 గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టికెట్లు కావాల్సిన వారు శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీఆన్‌లైన్.కాం ద్వారా కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382921647, 9959225608, 9959225609, 7382917289, 7382919694 తదితర ఫోన్ నంబర్లను సంప్రదించగలరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం-1, 2 డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. సిమ్మయ్య, యల్.యస్.నాయుడు తదితరులు ఉన్నారు.

'నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగర ప్రజలకు, వివిధ వర్గాల వారికి అందుబాటులో ఉంటూ, నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం చౌక్ బజారు కమలావిలేకరి ఆస్పత్రి ఎదుట మొదటి అంతస్తులో శనివారం జేడీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ హోమ్ సర్వీసెస్ ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో జేడీ కన్‌స్ట్రక్షన్స్ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంధవరపు సూరిబాబు, ఎంవీ పద్మావతి, మండవిల్లి రవి, శిమ్మ రాజశేఖర్, హౌస్ రిపేర్ వర్కర్స్, ఎలక్ట్రికల్ వర్కర్స్ పాల్గొన్నారు.



జేడీ కన్‌స్ట్రక్షన్స్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

బహిరంగ సభకు సర్వం సిద్ధం



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాల బహిరంగ సభకు అంతా సిద్ధం చేసినట్లు కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉదయం 10గంటల నుంచి జరగనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ రాజగోపాలరావు అభిమానులు, కళింగ సోదరులంతా అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధులు స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ నేతలు హాజరవ్వనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ కూడలిలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ముందుగా ప్రారంభించి అనంతరం సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజగోపాలరావు అభిమానులందరికీ భోజన సౌకర్యాలు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో దుప్పల వెకంటరావు, చింతాడ రామ్మోహన్‌రావు, కోత తిరుమలరావు, గుంట తులసీరావు, సన్యాసిరావు, ఎన్ని ధనుంజయరావు పాల్గొన్నారు.

జాతీయ ఉషూ పోటీలకు ఇద్దరు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి స్థాయి పోటీల్లో సీనియర్ విభాగంలో ముద్దాడ శిరీష (65 కేజీల కేటగిరి), బైరి ధనుంజయరావు(56 కేజీల కేటగిరి) బంగారు పతకాలు సాధించడంతో 32వ సీనియర్స్ జాతీయ ఉషూ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు పూణే వేదికగా ఈనెల 26 నుండి జూలై 1వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకుగాను పూణే పయనమైన క్రీడాకారులను శనివారం ఉదయం స్థానిక కోడి రామ్మూర్తి క్రీడ ప్రాంగణంలో వీడ్కోలు పలికారు. జాతీయ స్థాయి ఉషూ పోటీల్లో రాణించి జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని శ్రీకాకుళం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ డాక్టర్ కల్లేపల్లి శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న ఉషూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, చీఫ్ కోచ్ రెడ్డి శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రతినిధి కురిటి తారకరామ, కొమర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



చీఫ్ కోచ్ శ్రీధర్‌రావు, ఉషూ సంఘ ప్రతినిధులతో శిరీష, ధనుంజయ